# భగవద్భక్తి కలిగినదే భారతదేశము

కాశీ పట్టణములోపల బీదకుటుంబములో జన్మించిన చంద్రశేఖర తివారి అనే వ్యక్తి అక్కడ జరుగుతున్న నిత్యఅన్నదానములో రోజూ భోజనము చేస్తూ చదువుకుంటున్నాడు. అతను చదువుకునే సమయములో రాజకీయములో చేరి మన దేశమును బానిసత్వమునుండి విముక్తి చేయాలని ఆలోచన వచ్చింది. 1926లో కాన్‌పూర్‌లో లాలా లజపతి రాయ్ ఒక సమ్మేళనము ఏర్పరచారు. ఈ విషయము తెలిసి యువకులందరిని ఏకము చేసి కాన్‌పూర్ చేరుకున్నాడు. అక్కడ యువకులందరు చేరి పోలీసులను ఎదిరించటానికి వీలుగా బాంబులు తయారుచేయాలని ప్లాను వేసుకున్నారు. అప్పుడు చంద్రశేఖర తివారి 'ఈ కృత్రిమమైన బాంబులతో ఇతరులను హింసించకూడదు' అని చెప్పాడు. 'భగవంతుడు మనకు చేతులనిచ్చాడు, ధైర్యాన్ని యిచ్చాడు. కాబట్టి మనము చేతులతోనే పోట్లాడదాముకాని, ఏటువంటి అస్త్రముకాని, శస్త్రముకాని ఉపయోగించకూడదు' అన్నాడు. భగవంతుడు మనలోన వుంటున్నాడు అని భగవంతునిపైన విశ్వాసముచేత ఈ విధముగా బోధించాడు. ఆ సభలోపల లాలా లజపతి రాయ్ 'గో బేక్, గో బేక్' అని గట్టిగా అరుస్తూ వచ్చాడు. ఆ సమయములో పోలీసులు లాలా లజపతి రాయ్‌ను స్టేజీపైనే కాల్చివేశారు. ఆ దృశ్యమును చూచిన తరువాతనుండి చంద్రశేఖర తివారి భోజనము చెయ్యలేదు. లాలా లజపతి రాయ్‌ను చంపిన స్కాట్ అనే పోలీసుని ఏ విధముగానైనా చంపాలి అని శపథము చేశాడు. బహిరంగ సభలో మూడు రోజులలోపల స్కాట్‌ను చంపుతానని తీర్మానించాడు. ఈ విషయము తెలుసుకున్న పోలీసువాళ్లు ఆ వ్యక్తిని పట్టుకున్నవారికి 10వేల రూపాయలు బహుమానంగా యిస్తామని ప్రకటన చేశారు. చంద్రశేఖర తివారి అలహాబాదు చేరుకుని ఒక మిత్రుని యింటిలో వున్నాడు. ఎక్కడకు పోయినప్పటికిని అతను మెడలో కాశీ విశ్వేశ్వరుని బిళ్లను ధరించుకుని వెళ్లేవాడు. ఏ సభ ఆరంభించినప్పటికిని ఆ బిళ్లను ప్రార్థించి ప్రారంభించేవాడు.

sri sathyasai vachanamrutam

ధర్మవిరుద్ధంగా ఎక్కువరోజులు బ్రతకటంకంటే ధర్మస్థాపనకొరకు క్షణమైన బ్రతకటం శ్రేష్టమని ప్రతిజ్ఞ పూనుకున్నాడు. అతనికి ఒక నేరమునకు జరిమానాగా 4 అణాలు కట్టమని ఆదేశించారు. స్నేహితులంతా కూడి ధనము కట్టి విడుదల అవ్వమని వేడుకున్నారు. 'ధనముకట్టి నేను విడుదలవ్వను' అన్నాడు. 'ధర్మముతోనే జీవిస్తానుగాని ధనముకోసము నేను జీవించను' అని చెప్పాడు. భారతదేశము ధర్మస్వరూపదేశము. భగవంతుడు ధర్మస్థాపనకొరకు అనేక అవతారములెత్తిన దేశము. భారతీయసంస్కృతి ఇతర దేశములకు ఆదర్శవంతమైనది. ఒకనాడు రాత్రి నిద్రపట్టలేదు, కారణం తాను చేసిన ప్రతిజ్ఞ గుర్తుకువచ్చింది. మూడవరోజు ప్రారంభమయ్యింది. కంటిధార కారుస్తూ 'స్వామీ! నేను చేసిన ప్రతిజ్ఞ నా స్వార్థముగురించి అలోచించలేదు. నా దేశసంరక్షణకోసం, నా దేశము క్షేమముగా వుండాలని నేను కోరుకున్నాను కాబట్టి అది తీరేటట్లుగా దీవించమ'ని దీనంగా భగవంతుని ప్రార్థించాడు. మరునాడు పోలీసుల సభలో స్కాట్ వస్తున్నాడని తెలుసుకుని అక్కడకు పోయి అతనిని చంపాలని, ఆ తరువాత తన ప్రాణము పోయినా పరవాలేదు, లాలా లజపతి రాయ్‌ని చంపిన వ్యక్తిని చంపేతీరాలని నిశ్చయించుకున్నాడు. 'నా దేశముకొరకు ప్రాణాలను త్యాగము చేయటం మోక్షముతో సమానమ'ని భావించి ఆ గుంపులో చేరి పోలీసుల తుపాకీ తీసుకుని ఆ స్కాట్‌ను చంపేశాడు. స్కాట్ కూలిపోయిన దృశ్యమును చూసి తన ప్రతిజ్ఞ నెరవేర్చినందుకు కాశీ విశ్వేశ్వరుని మనసారా ప్రార్థించి తన మనసును శాంతింపచేసుకున్నాడు. భగవంతుని కృపవలన అక్కడే వున్న తివారి పోలీసులవారికి కనబడుటలేదు. తివారి 'ఆజాద్, ఆజాద్, ఆజాద్' అని అరుస్తున్నాడు. అప్పటినుండి యీ చంద్రశేఖర తివారిని 'చంద్రశేఖర ఆజాద్' అని పిలవటం ప్రారంభించారు. ఒక మిత్రుడు ధనమునకు ప్రలోభపడి, ద్రోహముచేసి చంద్రశేఖర ఆజాద్‌ను పోలీసులకు అప్పగించగా వారు అతనిని బందీచేసి చంపివేశారు. దేశముకొరకు తన ప్రాణాన్ని త్యాగముచేసి వీర పుత్రుడుగా ఖ్యాతిని పొందాడు. ధర్మముకొరకు తన ప్రాణాన్నికూడా త్యాగము చేశాడు.

**దైవతత్త్వమును అవగాహన చేసుకోవటం ఎవ్వరికీ సాధ్యముగాదు**



sri sathyasai vachanamrutam

మహాభారతమునందు ద్రోణాచార్యుడు పద్మవ్యూహమును పన్నాడు. పద్మవ్యూహాన్ని ఛేదించటం కేవలము వీరులకే సాధ్యము కాని అన్యులకు కాదు. ఆ సమయములో అర్జునుడు యింటిలోలేడు. అభిమన్యుడు ధర్మజుని దగ్గరకు పోయి అనుమతి యివ్వమని కోరాడు. ముందు నీవు పోయి నీ తల్లి అనుమతి తీసుకురమ్మన్నాడు, ధర్మజుడు. 'నీ భార్య గర్భవతి. నీవు చిన్నవాడవు, పైగా నీ తండ్రైన అర్జునుడు మరియు మేనమామ కృష్ణుడు లేడు. కాబట్టి వెళ్లవద్దు' అన్నది, సుభద్ర.

**వెఱవక కుంభజాతి కురువీరులపై మృగరాజువోలె నే**
**నుఱుకుచునుండ ఖండనికరోన్నత దివ్యమహాస్త్రపంక్తి నిం**
**బఱుపుచు గెల్చి రమ్ము సుత భద్రము నీకగునంచు పల్కకీ**
**తెఱగున పోకుపోకుమని తీవ్రతనాపుట నీకు పాడియా!**

'నా శత్రువులు నన్ను పిలుస్తుంటే నేను వెళ్లకపోతే నా కులమునకు, వంశమునకు అపకీర్తి తెచ్చినవాడనవుతాను, క్షత్రియులకు యిది తగదు', అన్నాడు అభిమన్యుడు. ఆ పలుకులకు ఆమె హృదయము కరిగింది.

**తారకాఖ్యాసురు దర్పమణచువేళ**
**గౌరి తనయుకిడ్డ వీర రక్ష**
**శంభరాసురవీరు జంపగా జనువేళ**
**భారవిసుతుకిడ్డ భవ్య రక్ష**
**మాతృ దాసిత్వంబు మాన్పనరగువేళ**
**వినత పుత్రునకిడ్డ విమల రక్ష**
**జనకుయానతి పాలింప వనికేగెడిన్ వేళ**
**తల్లి రాఘవుకిడ్డ ధన్య రక్ష**
**అట్టి శ్రీరక్ష ధీరక్ష అంగరక్ష**
**రక్షలందున దివ్యమౌ రామరక్ష**
**తోడునీడయై నిన్ను కాపాడు గాక!**

sri sathyasai vachanamrutam

అని కాళ్ళకు పారాణి వ్రాసి విజయముగా తిరిగి రమ్మని ఆశీర్వదించింది. అప్పుడు అభిమన్యుడు 'అమ్మా! ఏనాటికైనా మరణం తప్పదు. నా తండ్రికి నిరుత్సాహము కలుగకుండా, శత్రువులవద్దనుండి తప్పించుకున్నానన్న కోపము రాకుండా, నాయొక్క వంశ ప్రతిష్టను కాపాడాడు అనే కీర్తి రావాలి. నన్ను దీవించు'మన్నాడు. పద్మవ్యూహంలో ప్రవేశించగలిగాడు. ఇందుకు కారణం ఏమిటంటే, సుభద్ర గర్భముతో యుండినప్పుడు కొన్ని వీరగాథలు చెప్పుతూ వచ్చేవాడు, అర్జునుడు. అదే సమయములో పద్మవ్యూహము గురించి చెప్పుతూ వచ్చాడు. సుభద్ర వింటూ వింటూ నిద్రలోనికి జారుకున్నది. సుభద్ర వింటున్నాది అనుకుని చెబుతున్నాడు. కాని, నిజానికి సుభద్ర గర్భములో నున్న అభిమన్యుడు వింటున్నాడు. తల్లి గర్భముతో యున్నప్పుడు ఏ విధమైన బోధనలు వింటుందో అవి అన్నియూ బిడ్డకు చేరుతుంటాయి. ప్రస్తుతకాలములో శాస్త్రజ్ఞులుకూడా ఈ విషయమై పరిశోధనలు చేస్తూ వచ్చారు. తల్లి గర్భముతో యున్నప్పుడు ఏపిల్ రసము యిచ్చేవారు, బిడ్డ పుట్టిన తరువాత ఆ బిడ్డకు ఏపిల్ రసమంటే యిష్టమైపోయింది. అప్పుడు యిది యథార్థము అని విశ్వసించారు, శాస్త్రజ్ఞులు. అర్జునుడు సుభద్రకు పద్మవ్యూహముగురించి చెప్పేటప్పుడు కృష్ణుడు వచ్చి 'ఏమిటి చేస్తున్నావు', అని వారించాడు. ఎందుకంటే, 'పద్మవ్యూహముగురించి నీకు తప్ప అన్యులకు తెలియకూడదు కాబట్టి ఆపమ'న్నాడు. అందువలన అభిమన్యునకు పద్యవ్యూహమునందు ప్రవేశించటంవరకు తెలుసును కాని వెనుకకు రావటము తెలియదు. కాబట్టి, అందులో చిక్కుకుని చనిపోయాడు. కృష్ణునియొక్క తత్త్వములో అంతరార్థాన్ని గ్రహించటం, తెలుసుకోవటం చాలా కష్టము. దైవము ఎప్పుడు, ఏ విధముగా అనుసరిస్తాడో తెలియదు. దైవముయొక్క మాటలలో, చేతలలో ఏ విధమైన అంతరార్థముంటుందో ఎవ్వరూ ఊహించలేరు. అర్జునుడు యుద్ధమునుండి తిరిగి వచ్చే సమయములో అభిమన్యుడు తనకు ఎదురురావటం, క్షేమసమాచారం తెలుసుకోవటం అలవాటుగా యుండెడిది. అటువంటి అభిమన్యుడు యీనాడు ఎందుకు ఎదురు రాలేదు అని ఆలోచిస్తున్న సమయములో కృష్ణుడు ఎదురు వచ్చాడు. కృష్ణుడు అర్జునునితో యుద్ధం విషయముగురించి మాట్లాడుతూ 'జీవితము నీటిబుడగవంటిది, యుద్ధములో ఎవరైనా మరణించవచ్చు, సోదరులుగాని, బిడ్డలుగాని',

srisathyasaivachanamrutam

అని నీతిబోధలు చెపుతూ వస్తున్నాడుగాని అభిమన్యుడు చనిపోయిన విషయము చెప్పలేదు. ఈ విధమైన కృష్ణుని మాటలవలన అర్జునునకు సందేహము వచ్చింది. ఇక అంతఃపురము దగ్గరికి వచ్చిందనగా కృష్ణుడు అభిమన్యుడు చనిపోయాడని అర్జునునికి చెప్పాడు. అర్జునునికి కోపము వచ్చింది. 'నీవు వున్నావని, రక్షిస్తావని నేను యుద్ధములో ప్రవేశించాను. నీవు వున్నప్పటికిని నా కుమారుని మరణానికి కారణమయ్యావు' అని ఆవేశములో నీవు 'వంశనాశివి' అన్నాడు. కృష్ణుడు ఏమీ మాట్లాడలేదు, కారణం అర్జునుడు దుఃఖములో వున్నాడు. 'ఈ యుద్ధము నా కుమారునికి చంపటానికి వచ్చిందా, నీవు అనుభవించలేని రాజ్యము నాకక్కరలేదు', అని విచారించాడు అర్జునుడు. ఆ సమయము చూసుకొని కృష్ణుడు ప్రవేశించాడు. 'అర్జునా! కౌరవులయొక్క పుత్రులు పోయినా పరవాలేదు. నీ కుమారుడు నీకు ఎక్కువా?' అన్నాడు. 'ఇటువంటి స్వార్థము నీకు పనికి రాదు. యుద్ధములో అందరూ సమానమే', అని ధైర్యాన్ని బోధిస్తూవచ్చాడు.

**అంతర్వాహినిగా నిలచే ఆత్మధర్మము ఒక్కటే**

అశ్వత్థామ, రాత్రివేళ అందరూ నిదురించే సమయములోపల ఉపపాండవులను గొంతుకోసి సంహరించాడు. ఆ పసికందులను చంపటానికి ఎలా మనసు వచ్చిందని పాండవులు చాలా విచారించారు. అశ్వత్థామ శిరస్సును ఖండించి ద్రౌపదికి మనశ్శాంతిని కలిగిస్తానని అర్జునుడు ప్రతిజ్ఞ పూనాడు. అప్పుడు ద్రౌపది వచ్చి 'నీ తండ్రి నా భర్తలకు గురువు, నా పుత్రులకు మీరు గురువు. శిష్యుల పుత్రులను చంపటం న్యాయమా?' అని ప్రశ్నించింది.

**ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిం లేరు కిం**
**చిద్ద్రోహంబును నీకు చేయరు బలోత్సేకంబుతో చీకటిన్**
**భద్రాకారుల పిన్న పాపల రణప్రౌఢక్రియాహీనులన్**
**నిద్రాసక్తుల సంహరింపనకటా నీ చేతులెట్లాడెనో!**

పుత్రులు చనిపోయిన కారణమున ద్రౌపదికి పిచ్చిపట్టినది కాబోలు

**కొడకులపట్టి చంపెనను కోపమునొందదు బాలఘాతకున్**

**విడువుమటంచు చెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది వీడు విప్రుడే**
**విడువగనేల చంపుడిటు వీనిని మీరలు చంపరేని నా**
**పిడికిటి పోటునన్ శిరము భిన్నము చేసెద చూడుడందరున్**

అని భీముడు కోపముతో అశ్వత్థామను చంపబోయినప్పుడు ద్రౌపది అడ్డుకొని 'నా పుత్రులు వెనుకకు తిరిగిరారు. మీరు అశ్వత్థామను చంపి మీయొక్క గురువుభార్యకు పుత్రశోకమును అందించవద్దు' అని బ్రతిమలాడింది. అటువంటి త్యాగమూర్తి, ద్రౌపది. అప్పుడు అర్జునుడు తనయొక్క ప్రతిజ్ఞ వృథా అయినట్లేనా అని ద్రౌపదిని అడిగాడు.

**వెఱచినవాని దైన్యమున వేదననొందినవాని నిద్ర మై**
**మఱచినవాని సౌఖ్యమున మద్యము ద్రావినవాని భగ్నుడై**
**పఱచినవాని సాధుజడభావమువానిని కావుమంచు వా**
**చఱచినవాని కామినిన్ చంపుట ధర్మముకాదు అర్జునా!**

అనగా భయపడినవానిని, నిద్రలో మైమరచినవానిని, మద్యము సేవించినవానిని, బెదిరిపోతూ కాలిమీద పడినవానిని, స్త్రీలను చంపుట ధర్మమా అని ద్రౌపది బదులిచ్చింది. ఆ సమయములో కృష్ణుడు వచ్చి 'చెల్లెలా! నీయొక్క భర్త ప్రతిజ్ఞలోపల మహా ధీశాలి. తన జీవితములో ఏనాడుకూడా ప్రతిజ్ఞ తప్పినటువంటివాడుకాడు. కాబట్టి ప్రతిజ్ఞ తీరలేదనే అపకీర్తి తేకూడదు. నీకు సర్వధర్మములు తెలుసును. నీవే దీనికి ఉపాయము చెప్పుమ'న్నాడు. ద్రౌపది అనగా పాంచాలి, అంటే 'శబ్ద, స్పర్శ, రూప, రస గంధాదులను తన వశము చేసుకున్నది' అని అర్థము. 'నీయొక్క పతివ్రతా ధర్మాన్ని సూక్ష్మముగా విచారించు' అన్నాడు కృష్ణుడు.

**పతుల పలు మాటకు ఎదురు చెప్పంగబోదు**
**వారి సేవలు చేయగా తీరదనదు**
**తనకునున్నట్టి దానితో తృప్తిగనును**
**ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు**

అప్పుడు ద్రౌపది ఒక్క క్షణము ఆలోచించి అర్జునునితో చెప్పింది.

srisathyasaivachanamrutam

**విశ్వస్తుత్యుడు శక్రసూనుడు మహావీరుండు ఘోరాసిచే**
**నశ్వత్థామ శిరోజముల్దరగి చూడాంతర్మహారత్నమున్**
**శశ్వత్కీర్తి వెలుంగబుచ్చుకొని పాశవ్రాత బంధమ్ములన్**
**విశ్వాసంబుననూడ్చి త్రోచె శిబిరోర్వీభాగము బాసిపోన్.**

ఈ విధముగా చేసినట్లయితే నీయొక్క ప్రతిజ్ఞ నెరవేర్చినట్లవుతుంది మరియు అతని ప్రాణము నిలుస్తుంది అన్నది ద్రౌపది. ఆనాడు స్త్రీలకుకూడా ధర్మసూత్రములు చాలా తెలుసును. ధర్మము అనేకవిధమైనట్టి మార్గములలోపల అనేక విధమైన రూపములు ధరిస్తుంటుంది. బ్రహ్మచర్యధర్మము, గృహస్థధర్మము, వానప్రస్థధర్మము, సన్యాసధర్మము. ఈ నాలుగు ఆశ్రమ ధర్మములు ఒక్కొక్కటి భిన్నముగా కనిపించినప్పటికిని అన్నింటియందు అంతర్వాహినియైనట్టి ఆత్మధర్మము ఒక్కటిగానే వుంటుంది. కనుక ఏ దేశమువారైనప్పటికిని వారికి వారియొక్క దేశాభిమానము వుండేతీరాలి. స్వప్నమునందైనా తన దేశముయొక్క కీడును తలపెట్టరాదు. దేశమును తన దేహముగా భావించవలెను. నీయొక్క దేహాన్ని ఏ విధముగా రక్షించుకొనుటకు పాటుపడుతావో అదే విధముగా నీ దేశాన్ని రక్షించటానికి పాటుపడాలి.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుడువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

ఇటువంటి భావనలేనివాడు పీనుగతో సమానము. కనుక దేశాభిమానము, ధర్మాభిమానము, సంస్కృతిఅభిమానము మన రక్తములో చేరివుంటున్నాయి. ఒక్క దైవవిశ్వాసముండిన ఇవి అన్నియు చేరిపోతాయి. నీవెవరవు, నీవు ఎక్కడనుండి వచ్చావు అంటే నేను భారతీయుడను, భారతదేశమునుండి వచ్చాను అని అంటాము. నీ మతము భారతీయ మతము. నేను భారతీయుడనంటూ, భారతీయ సంస్కృతిని ఉల్లంఘిస్తే నీవు భారతీయుడెట్లా అవుతావు. భా-అనగా తేజస్సు, ప్రకాశము అనగా దైవస్వరూపమే.

sri sathyasai vahamrutam

భా-భగవత్, రతి-యిష్టము. భగవత్ యిష్టము కలిగినటువంటిదే భారతదేశము.

**పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఈ మూడింటిని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి**

ధర్మాన్ని రక్షించటానికి భగవంతుడు అవతారము దాల్చుతున్నాడు. కనుక ధర్మాన్ని ఉల్లంఘించరాదు. యీనాటి యువకులకు ఇది చాలా అవసరము. అధునిక యుగములో, యీ ఆధునిక విద్యలో మన పవిత్రతను, సంస్కృతిని విస్మరిస్తున్నాము. మొట్టమొదట మన సంస్కృతిని మనము గుర్తించాలి. వ్యాసుడు 18 పురాణములు వ్రాసాడు. ఈ 18 పురాణములలోపల రెండు వాక్యములే ప్రధానముగా చెప్పాడు. 'పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం' అని చెప్పాడు. ఇదే భారతీయులయొక్క ప్రధానమైనటువంటి తత్వము. కారణమేమనగా భగవంతుడు అందరియందు వుంటున్నాడు. 'ఈశ్వర స్సర్వభూతానాం'. ఈ విశ్వాసాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. ఈ MBA పిల్లలు ఎటువంటి అధికారములలో యున్నను మీరందరు భగవద్విశ్వాసముతో కార్యములను తలపెట్టినప్పుడు విజయాన్ని సాధించగలరు. మీరందరు ఒక ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుకావాలి. యీనాడు నూతన విద్యకాదు మనకు కావలిసినది, నూతన సమాజముకాదు మనకు కావలిసినది, సమసమాజముకాదు మనకు కావలిసినది. మన మతము మతముగానే వుండనీ. పవిత్రమైన హృదయవాసము కావాలి. పవిత్రమైనటువంటి హృదయము కలిగినటువంటివారుగా కావాలి. అదే యీనాడు కావాలి. అది లేకుండా మనము ఎన్ని చేసినా ప్రయోజనము లేదు. Purity వుండినప్పుడే మనకు Unity వస్తుంది. Unity వుండినప్పుడే మనకు Divinity వస్తుంది. Unity లేనప్పుడే Enimity ప్రారంభమవుతుంది. దైవత్వముతోనే మనకు Purity వస్తుంది. దినము మనము వూడుస్తూ వూడుస్తుంటే శుభ్రముగా వుంటుంది. అదే విధముగా దినము మనము భగవచ్చింతన చేస్తూవుంటే హృదయము పవిత్రము అయిపోతుంది. మన హృదయమును శుభ్రపరచుకోవాలి. మన చర్యలను శుభ్రపరచుకోవాలి. మన దృష్టిని శుభ్రపరచుకోవాలి. అప్పుడే మనస్సు పవిత్రముగా వుంటుంది. దేశముగురించి త్యాగము చేసినవారు చాలామంది యువకులు వున్నారు. కాని దురదృష్టవశాత్తు వారి పేర్లు బయటికి రాలేదు.

sri sathyasai vachanamrutam

వారందరు దైవవిశ్వాసముతోనే జీవించారు, వారి జీవితాన్ని త్యాగము చేశారు. వారియొక్క త్యాగాన్ని ఎవరూ గుర్తించటంలేదు. తెలివితేటలులేనివారిని, స్వార్థపరులను గద్దెనెక్కించి వారిని రాజులు చేసి దేశమును నాశనము చేస్తున్నారు. యథార్థముగా విదేశీయులు మన దేశముయొక్క ధనమును లూటీ చేయలేదు. వారు మన ధనమును మనకోసమే ఖర్చు చేశారు. కానీ యీనాటి రాజకీయనేతలు భారతదేశముయొక్క ధనమును దోచుకొని వేరే దేశములలోపల దాచుకుంటున్నారు. కాబట్టి యీనాటి యువకులు మన దేశ సంపత్తిని మన దేశముకొరకై ఖర్చుపెట్టాలి. నల్లధనమంతా ఏమైనదో ఇంతవరకు తెలియడంలేదు. యీనాటి యువకులు భారతీయ సంస్కృతిని మదిలో పెట్టుకొని దేశానికి సేవ చెయ్యండి. ఎంతటి గొప్ప సైంటిస్టు అయినాసరే తిరిగి తిరిగి మరల మన దేశానికి వస్తున్నారు. కాబట్టి యీ విషయాన్ని మీరు ఇప్పటినుండి గుర్తుపెట్టుకోండి. యీ విశ్వాసమే దేశాన్ని రక్షించేది. కేవలం ఆధ్యాత్మికమార్గములో మాత్రమే దేశాన్ని రక్షించగలరు. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి ఈ మూడింటిని మీరు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి.

**మహాభారతము పంచమవేదము**

హనుమంతుడు 'చిరంజీవి' అంటే వానికి యుగములే లేవు. ఎందుకంటే హనుమంతుడు వాయుకుమారుడు. వాయువు పంచభూతములలో ఒక్కటి. అదే విధముగా భీముడుకూడను వాయుపుత్రుడు. పాండవులవి సహజ జన్మములు కావు. అసహజ జన్మములు. మహాభారతమును పంచమ వేదము అన్నారు. ఒక చిన్న ఉదాహరణము. సభలో పాండవులు కూర్చున్నారు. దుర్యోధనుడు వచ్చి 'ఖజజా నాతోడ పోరాడనగునే నీకు' అన్నాడు. అందరూ వింటున్నారు. ఈ అర్థము ఎవ్వరికి తెలియదు. ఎవ్వరిని పిలుస్తున్నాడు? ఎందుకంటే, ఒక్కరు లేచినా అవమానమే, అందరూ లేచినా అవమానమే. పాండవులు సందిగ్ధావస్థలో మునిగిపోయారు. కృష్ణుడు భీముని లెమ్మని సంజ్ఞచేశాడు. భీముడు లేచాడు. దుర్యోధనుని ప్లానంతా వృధా అయిపోయింది. దుర్యోధనుడు అక్కడనుండి వెళ్లిపోయాడు. అప్పుడు ధర్మజుడు కృష్ణుని అడిగాడు, 'ఇటువంటి పదము నేను వినలేదే' అన్నాడు. 'ఖ' అంటే ఆకాశము. 'జ' అంటే ఆకాశములో పుట్టింది వాయువు.

srisathyasaivahini

రెండవ 'జ' అంటే వాయువుకు పుట్టినటువంటివాడు భీముడు అని అర్థము. సర్వశక్తిమయుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అయినటువంటి కృష్ణునికి తెలియనటువంటిది ఏదిలేదు అని ధర్మజుడు సంతృప్తి చెంది అక్షరజ్ఞానము, పదజ్ఞానము, బోధజ్ఞానమువంటి సర్వజ్ఞానముకలవాడని వర్ణన చేశాడు.

అభిమన్యుడు చనిపోయిన సమయములో అర్జునుడు కృష్ణుడిని 'వంశనాశి' అని ఆవేశములో సంబోధించాడు. అర్జునుడు అవేశములో వున్నాడని కృష్ణుడు ఏమీ అనలేదు. నన్ను ఏ విధముగా దూషించినా పరవాలేదు అని ఓపిక పట్టుకుని వున్నాడు. ఉత్తర, ప్రసవములో మరణించినటువంటి శిశువుకు జన్మమునిచ్చింది. ఈ వార్తవిని పాండవులంతా శోకములో వున్నారు. కారణం ద్రౌపది పుత్రులు ఉపపాండవులు మరణించారు. అభిమన్యుడు చనిపోయాడు. కేవలము వంశమునకు వారసుడని ఉత్తరకు పుట్టిన బిడ్డమీద అందరూ ఆశలు పెట్టుకున్నారు. దురదృష్టవశాత్తు ఆమెకూ మరణించిన బిడ్డ పుట్టింది. పాండవ వంశమే నిర్వంశమైపోయిందని చింతించి కృష్ణుని తెమ్మని అర్జునుని పంపించారు. కృష్ణుడు వచ్చిన సమయములో ద్రౌపది, సుభద్ర మరియు ఉత్తర కంటిధారలు కారుస్తూ కూర్చున్నారు. ద్రౌపది పోయి చనిపోయిన బిడ్డను చేటలో వుంచి కృష్ణునికి యిచ్చి ఏడ్చింది. ఆ పిల్లవానిని చూచి అంతా అభిమన్యుని పోలికలే వచ్చినాయి అన్నాడు. అప్పుడు ద్రౌపది 'అవును, అవును అభిమన్యునిలాగా శవముగానే వున్నాడు', అన్నది. కృష్ణుడు 'ఛీ! ఛీ! ఏమిటామాటలు చెల్లెలా!' అన్నాడు. కృష్ణుడు 'ఆ పిల్లవాడు చాలా అందంగా, చలాకిగా వున్నాడు', అని అనగానే పాండవులంతా భోరున ఏడ్చారు. కృష్ణుడు ఆ పిల్లవానిని అటుయిటూ త్రిప్పి ప్రాణం పోసేటప్పటికి పిల్లవాడు కెవ్వున అరచాడు. ఆ శబ్దము విని పాండవులంతా ఆశ్చర్యములో మునిగిపోయారు. అర్జునుడు కృష్ణుని పాదాలపైన పడి 'పాండవుల వంశాకురాన్ని నిలిపినటువంటి ఓ వాసుదేవా!' అన్నాడు. అప్పుడు కృష్ణుడు 'బావా! ఆనాడు నన్ను 'వంశనాశీ' అని చెప్పావే, యీనాడు 'వంశాకురాన్ని అందించావు', అంటున్నావే. అది రైటా, యిది రైటా' అన్నాడు. నా అజ్ఞానాన్ని క్షమించమని కోరాడు, అర్జునుడు. అనగా కోపములో ఆ పరిస్థితియందు అనేక విధములుగా భగవంతునికూడా దూషిస్తాడు భక్తుడు. ఆనాటినుండి కృష్ణుడే మా ప్రాణమని విశ్వసిస్తూవచ్చారు. ఆ బిడ్డను

sri sathyasai vachanamrutam

పరీక్షించి ప్రాణాన్ని పోశారు కాబట్టి 'పరీక్షిత్తు' అని నామకరణము చేశారు.

కృష్ణుడు ద్వారకకు వెళ్ళినప్పుడు అర్జునునికూడా తోడు రమ్మన్నాడు. అర్జునుడు ద్వారకలో 36 దినములున్నాడు. అక్కడనుండి బయలుదేరుటకు కృష్ణుని అనుమతికోరాడు. 'ఇప్పుడు పోవటానికి వీలులేదు ఇంకా కొన్ని దినములు వుండమ'న్నాడు. ఈ లోపల యాదవకులములో ముసలము పుట్టింది. యాదవులమధ్య చెలరేగిన ఆ అంతర్‌యుద్ధములో అందరూ మరణించారు. మిగిలిన బాలవృద్ధులను, గోపికలందరిని అర్జునుడు హస్తినాపురమునకు తీసుకువచ్చాడు. కుంతికి వయోభారము వలన కళ్ళకు మసకలు వచ్చింది. అర్జునుని సమాచారము కోసము ఎదురుచూస్తుంది. అర్జునుడు విచారముతో తల్లి దగ్గరకు వచ్చి ఆమె పాదాలపైన పడి కెవ్వుమని గట్టిగా ఏడ్చి 'మన ప్రాణం మనలను వదలి వెళ్ళిపోయింది, కృష్ణుడు ఇకలేడు', అని చెప్పాడు. అప్పుడు 'కృష్ణా!' అని కుంతిదేవి ప్రాణం విడిచింది. ధర్మజుడు కుంతిదేవిని తన ఒడిలో పెట్టుకున్నాడు. నకులసహదేవులను కర్మకాండలకు ఏర్పాటుచేయమన్నాడు. భీముణ్ణి అరణ్యమునకు బయలుదేరుటకు సన్నాహములు చేయమన్నాడు. అర్జునిని పిలచి పరీక్షిత్తుకు పట్టాభిషేకమునకు ఏర్పాటు చేయమన్నాడు. ఈ మూడు కార్యములు ఒకేసారి చెయ్యాలి. ఇంతకు మించిన దురదృష్టమైన ఘట్టము ఏముంటుంది. 'ఈ రాజ్యము కృష్ణునివలన వచ్చినది. మా అణువణువు కృష్ణుడు. కనుక కృష్ణుడులేని మా జీవితము వ్యర్థము' అని భావించారు, పాండవులు. అయినప్పటికి కుంతీదేవికి కర్మకాండ చేశారు, పరిక్షితునకు పట్టాభిషేకము చేశారు. తరువాత ధర్మజుడు 'మాతానాస్తి, పితానాస్తి, నాస్తి బంధు సహోదరః అర్థంనాస్తి భవంనాస్తి తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త' అని మనస్సు గట్టి చేసుకుని మహాప్రస్థానానికి బయలుదేరాడు. ముందు ధర్మజుడు నడుస్తుండి ఆ తరువాత అర్జునుడు, భీముడు, నకులసహదేవులు, ద్రౌపది నడుచుకుంటూ వెళ్లిపోయారు. మార్గమధ్యములో ఎవ్వరికి ఎవ్వరు సంబంధము లేకుండా పోతున్నారు. అహారపానీయాలు లేవు. కొంతదూరము పోయేటప్పటికి ద్రౌపది ప్రాణం విడిచింది. 'ధర్మజా!' అని పిలిచింది. ధర్మజుడు పలుకలేదు. అదే వైరాగ్యము. అదే విధముగా వరుసగా నకులసహదేవులు, భీముడు, అర్జునుడు చనిపోయారు. ఇది ఒక పరీక్ష. ధర్మజుడు పోతూవున్నాడు.

srisathyasaivahamrutam

కొంతదూరము పోయిన తరువాత శబ్దము వచ్చింది. వెనుతిరిగి చూశాడు. ధర్మజుని వెంట ఒక కుక్క వదలకుండా వస్తుంది. ధర్మజునికికూడా మూర్ఛవచ్చింది. అదే సమయములో స్వర్గద్వారము వచ్చింది. ద్వారపాలకులు అడిగారు, 'ధర్మజా! నీవు చాలా ధర్మస్వరూపుడవు. ధర్మఆకారాన్నే ధరించినావు. కాని నీవు ఒకానొక సమయములోపల 'అశ్వత్థామ హతః కుంజరః' అని అబద్ధము ఆడి గురువును నిరాశకు గురి చేశావు. కాబట్టి నీవు కొంతకాలము నరకాన్ని అనుభవించవలసి వస్తుంది' అని చెప్పారు. కాని, ధర్మజుడు అందుకు విచారించలేదు.

**(తేదీ 28-04-1988న త్రయి బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam